డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ రవికాంత్

విద్యానగర్, జనవరి 16: డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్)గా స్థానిక ఎంసీహెచ్‌లో పని చేస్తున్న డాక్టర్ రవికాంత్‌ను నియమిస్తూ తెలంగాణ వైద్య విధానపరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందు డీసీహెచ్ఎస్‌గా డిప్యూటేషన్‌పై పని చేసిన డాక్టర్ కృష్ణ ప్రసాద్‌ను తిరిగి పెద్దపల్లికి బదిలీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, జనవరి 16 : సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుక బడిన తరగతుల సంక్షేమ, విద్యా శాఖల ఆధ్వర్యంలో ఇంగ్లిషు మీడియంలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ కే శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం విద్యార్థులు రూ. 100 అపరాధ రుసుముతో జనవరి 20, 2024లోగా ఆన్‌లైన్‌లో https://tgcet.ogg.gov.in లేదా https://www.tswreis.ac.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే, టీఎస్‌డబ్ల్యూర్‌సీవోఈల్లో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కే శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు నీట్, ఐఐటీ - జేఈఈ, సీఎంఏ, సీఎల్ఏటీ పరీక్షల్లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో https:// www.tswreis.ac.in లేదా https:// tsswreis.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పంచకల్యాణ మహోత్సవం

చొప్పదండి, జనవరి 16: మండల కేంద్రంలోని వైశ్యాభవన్ ఆవరణలో సంక్రాంతిని పురస్కరించుకుని మండల ఆర్యవైశ్య సంఘం మహిళలు పంచకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం లక్ష పసుపు కొమ్ములు, లక్ష గాజుల నోము చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

చొప్పదండి, జనవరి 16: గుమ్లాపూర్‌లో జరుగుతున్న జిల్లాస్థాయి గ్రామీణ క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి మంగళవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసవేని రాజశేఖర్, కుమార్, ఆనంద్, రాజమౌళి, క్రీడాకారులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

గంగాధర, జనవరి 16: బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి మనోజ్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. మనోజ్‌ను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, సర్పంచ్ సాగి రమ్య, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, ఉపాధ్యాయులు అభినందించారు.

బహుమతులు అందజేత

వీణవంక, జనవరి16: రెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాడ సత్యనారాయణరెడ్డి స్మారకార్థం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అతడి కుమారుడు సనత్‌కుమార్‌రెడ్డి యువతకు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి సర్పంచ్ పోతుల నర్సయ్య, ఎంపీటీసీ ఒడ్డెపెల్లి లక్ష్మి-భూమయ్య, స్థానిక నాయకులు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

తిమ్మాపూర్, జనవరి16: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. సోమవారం విజేత జట్టుకు సర్పంచ్ రావుల రమేశ్ ట్రోఫీ అందజేశారు. యువకులు క్రీడలవైపు దృష్టి సారించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇక్కడ ఉపసర్పంచ్ బేతి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నూనె సురేశ్ పాల్గొన్నారు. అలాగే పొరండ్ల గ్రామంలో సొసైటీ వైస్ చైర్మన్ ఎల్లాల రమణారెడ్డి స్మారక క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు ట్రోఫీ అందజేసి అభినందించారు.

నూతన ఎంవీఐకి సన్మానం

హుజూరాబాద్‌టౌన్, జనవరి16: హుజూరాబాద్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంవీఐ ఈశ్వర్‌సింగ్ ఠాకూర్‌ను మంగళవారం హుజూరాబాద్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ సలీం, కార్యదర్శి మజీద్, ఉపాధ్యక్షుడు ఎండీ జానీ, సివిల్ సప్లయ్ కాంట్రాక్టర్లు మల్లయ్య, హరిశంకర్, నాయకులు, ఎంవీఐ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళిత బంధు లబ్ధిదారుల వినతి

హుజూరాబాద్‌టౌన్, జనవరి16: దళిత బంధు పథకం రెండో విడుత డబ్బులు మంజూరు చేయించి తమ కుటుంబాలను ఆదుకోవాలని నియోజకవర్గంలోని 500 మంది లబ్ధిదారులు కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌ను హుజూరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఫాస్టాగ్‌కు కేవైసీ తప్పనిసరి

- ఈనెల 31 వరకు తుది గడువు
- తర్వాత డీయాక్టివేట్ తథ్యం
- ఎన్‌హెచ్ఏఐ ప్రకటన విడుదల

రేణికుంటలోని టోల్‌ప్లాజా

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 16 : రహదారులపై టోల్‌టాక్స్ సులువుగా చెల్లించేందుకు ప్రవేశపెట్టిన ఫాస్టాగ్ విధానానికి ఈ నెల 31వ తేదీ లోగా కేవైసీ తప్పనిసరిగా చేయాల్సిందే. లేకుంటే వాటిని డియాక్టివేట్ లేదా బ్లాక్ చేసేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) సిద్ధమవుతోంది. ఈ మేరకు ఆ సంస్థ ఒక ప్రకటన కూడా విడుదల చేసింది. ఈనెల 31వ తేదీలోగా జాతీయ రహదారులపై ప్రయాణించే అన్ని రకాల వాహనదారులు విధిగా కేవైసీ పూర్తిచేయాలని, అనంతరం ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ ఉన్నా అవి పనిచేయకుండా బ్యాంకులు చర్యలు తీసుకుంటాయని ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం సమీపంలోని టోల్ ప్లాజాల్లో లేదా ఫాస్టాగ్ సేవలు అందిస్తున్న బ్యాంకు కస్టమర్ కేర్ నెంబర్లలో గానీ సంప్రదించాలని సూచించారు. కొంతమంది ఒకే ఫాస్టాగ్‌ను పలు రకాల వాహనాలకు వినియోగిస్తూ, ఆదాయానికి గండి కొడుతున్నారనే కారణంతో కేవైసీ చేయాలనే నిబంధన అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది. అయితే, వాహనదారులు మాత్రం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మండిపడుతున్నారు. తాము ఒక వాహనానికి ఏర్పాటు చేసిన ఫాస్టాగ్‌ను మరో వాహనానికి ఎలా మార్చుతామంటూ, తప్పుడు ప్రచారంతో వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తున్నారు. కాగా, జిల్లాలో ప్రతి నిత్యం సుమారు 5 వేల నుంచి 8 వేలకు పైగా వాహనాలు వివిధ జాతీయ రహదారులపై రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ వాహనాల యజమానులంతా ముందుగా ఫాస్టాగ్ కేవైసీ చేసుకోవడంపై దృష్టిసారించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సూచిస్తున్నారు.

జనం లేక వెలవెలబోతున్న కౌంటర్లు

ఆర్టీఏ.. వెలవెల

నిత్యం రద్దీగా ఉండే తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం పండుగ వేళ వెలవెలబోయింది. రోజూ మూడు అంకెల సంఖ్యలో వచ్చే దరఖాస్తుల సంఖ్య రెండు అంకెలకే పరిమితమైంది. మంగళవారంతో పాటు పండుగ వేళ నూతన రిజిస్ట్రేషన్లు, ఇతర సేవలను ఎవరూ వినియోగించుకోకపోవడంతో కార్యాలయంలో జనం తాకిడి తగ్గింది. ఇక, వచ్చిన కొద్దిమంది కేవలం నిమిషాల్లో పని పూర్తి కావడంతో సంతోషంగా తిరిగి వెళ్లారు. **-తిమ్మాపూర్, జనవరి16**

భజన మండలి సభ్యుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, జనవరి 16: భూపాల్‌పల్లి జిల్లా పరకాలలో షిర్డీ సాయి సత్సంగ్ మందిర్ ద్వి దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సత్సంగ్ మందిర్ అధ్యక్షుడు డాక్టర్ విజయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించారు. ఇందులో కరీంనగర్‌కు చెందిన శ్రీషిర్డీ సాయి భక్త భజన మండలి సభ్యులు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 15,016 గెలుచుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని అభినందించి, సత్కరించారు. భజన మండలి గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్, వ్యవస్థాపక అధ్యక్షుడు శంకర్, సభ్యులు ఉన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

ప్రభుత్వాలను పడగొట్టే చరిత్ర 'బీఆర్ఎస్'కు లేదు

- ఆ నీచ సంస్కృతి బీజేపీ నాయకులదే
- బండి సంజయ్ మతాల పేరుతో రాజకీయాలు చేయడం మానుకో
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, జనవరి 16: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నారని, త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసీఆర్ పడగొడుతారంటూ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పేర్కొన్నారు. ప్రభుత్వాలను పడగొట్టే చరిత్ర 'బీఆర్ఎస్'కు లేదని స్పష్టం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవీఆర్ మాట్లాడారు. ఎన్నికల్లో గెలువని చోట ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రభుత్వాలను పడగొట్టే నీచ సంస్కృతి బీజేపీ నాయకులదేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మహారాష్ట్ర, గోవా, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూల్చడమే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. తెలంగాణలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ నాయకులు ప్రయత్నిస్తున్నట్లు బండి సంజయ్ వ్యాఖ్యలు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. దమ్ము, ధైర్యం ఉంటే మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డిని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇప్పటివరకు రైతుబంధు సాయం ఇవ్వకపోవడం, రుణమాఫీ చేయకపోవడం, ప్రజా దర్బార్‌ను రెండు రోజులకే ఎత్తి వేయడంపై నిలదీయాలని బండిని డిమాండ్ చేశారు. గతంలో వినోద్‌కుమార్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప, కరీంనగర్ అభివృద్ధికి సంజయ్ చేసిందేమిటని నిలదీశారు. ఎప్పుడూ కులాలు, మతాల పేరుతో రాజకీయాలు చేయడం తప్ప నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిందేమీ లేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ కేవలం సింగిల్ డిజిట్ స్థానాలకే పరిమితమైందన్నారు. పార్టీని ప్రజలు ఎందుకు ఆదరిస్తలేరో సమీక్షించుకోవాలని హితవు పలికారు. చిత్త శుద్ధి ఉంటే అయోధ్య గుడి పేరుతో చేస్తున్న రాజకీయాలు మానుకోవాలని సూచించారు. కేసీఆర్ అంటే బండికి ఇంకా భయం పోలేదని, అందుకే బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, నాయకులు ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, శాతరాజు యాదగిరి, పిట్టల మధు, దండబోయిన శేఖర్, కొత్తకొండ నాగరాజు, నెల్లి శంకర్, ఇస్కుల్ల ఆంజనేయులు, గంజి శ్రీనివాస్, పిండి సందీప్, రఘు, అనిల్, తిరుపతి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి పండుగ

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ఇండ్లల్లో నోములు నోచిన మహిళలు

కుమారుడికి భోగిపండ్లు పోస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కమాన్‌చౌరస్తా/ కలెక్టరేట్/ చొప్పదండి/ గన్నేరువరం/ శంకరపట్నం/ వీణవంక/ హుజూరాబాద్‌టౌన్/మానకొండూర్, జనవరి16: జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంక్రాంతి పండుగను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు ఉదయమే వాకిళ్లలో రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. పలువురు మహిళలు సంక్రాంతి నోము నోచుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇండ్లల్లో పిండివంటలు చేసుకున్నారు. కాగా, జిల్లా కేంద్రంలోని గిద్దెపెరుమాండ్ల స్వామి ఆలయానికి పలువురు ఎడ్ల బండ్లతో వచ్చి ప్రదక్షిణలు చేశారు. ఆలయంలో అర్చకుడు రామక శంకరశర్మ ఆధ్వర్యంలో పూజలు జరుగగా, ఈవో మారుతి, పాల్గొన్నారు. సంక్రాంతి సంబురాల్లో భాగంగా యువత గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. పలు యువజన సంఘాల సభ్యులు, కార్పొరేటర్ల ఆధ్వర్యంలో పతంగుల వేడుకలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మంగళవారం రైతులు కనుమను కనుల పండువగా జరుపుకొన్నారు. పశువులను అలంకరించి పొలాల వద్ద పూజలు చేశారు. ఇండ్లల్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేసి బంధుమిత్రులను ఆహ్వానించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మకర సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ పమేలా సత్పతి తన కుమారుడిపై భోగిపండ్లు పోసి, ఆశీర్వదించారు. అనంతరం కుటుంబసభ్యులు, క్యాంపు కార్యాలయ సిబ్బందితో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. చొప్పదండిలోని శ్రీ వేంకటేశ్వర-మణికంఠాలయంలో పైడ మహేశ్ విరాళంగా ఇచ్చిన అయ్యప్ప విగ్రహానికి ఫల పంచామృతాలతో అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి మకరజ్యోతి దివ్య దర్శనం తిలకించారు. అనంతరం పడునెట్టాంబడి కార్యక్రమంలో పడిముట్టించి, అయ్యప్ప దర్శనం చేసుకుని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేశ్‌గౌడ్, గౌరవాధ్యక్షుడు గొల్లపల్లి శ్రావణ్‌కుమార్, అర్చకుడు చరణ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షుడు బొడిగె వెంకన్న, ఎలిగేటి రాములు, ఎన్నం మునీందర్, కార్యదర్శులు ఉసికె రాజశేఖర్‌రెడ్డి, పిట్టల సత్యం, బత్తిని ప్రశాంత్, కమిటీ సభ్యులు సింహాచలం హరికృష్ణ, కత్తి రమేశ్, పొరండ్ల భాస్కర్, సామల వేణు, మామిడాల నిరంజన్, గుర్రం సమర్ రెడ్డి, యామ రమేశ్, బొడిగె అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. గన్నేరువరం మండలం ఖాసీంపేటలో మహిళా భవనం వద్ద గంప నాంపల్లి, నర్సమ్మ స్మారక ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనగా, నిర్వాహకులు సర్పంచ్ గంప మల్లేశ్వరి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంప వెంకన్న బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎలేటి స్వప్నాచంద్రారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు నగునూరి శంకర్ పాల్గొన్నారు. శంకరపట్నం మండలం వంకాయగూడెం పరిధిలోని అయ్యప్పస్వామి ఆలయంలో రాత్రి మకర జ్యోతిని వెలిగించగా, అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు దర్శించుకున్నారు. వీణవంక మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. వేడుకల్లో ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ఎంపీపీ లత-శ్రీనివాస్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొని మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. హుజూరాబాద్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం జ్యోతి దర్శనం కార్యక్రమం నిర్వహించగా, దీక్షాపరులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మానకొండూర్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు నివాసంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. వారి ఆచారం ప్రకారం నిర్వహించిన ఈ వేడుకలో వివిధ రకాల బొమ్మలు కొలువు దీరగా, జీవీఆర్ కుటుంబ సభ్యులు సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఐడీసీ మాజీ చైర్మన్‌కు మాజీ మంత్రి పరామర్శ

ఈద శంకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, తదితరులు

కార్పొరేషన్, జనవరి 16: ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్ రెడ్డి మాతృమూర్తి కమలామూర్తి ఇటీవల మృతి చెందారు. కాగా, మంగళవారం కరీంనగర్‌లో ఈద శంకర్‌రెడ్డితో పాటు కుటుంబసభ్యులను మాజీ మంత్రి హరీశ్ రావు పరామర్శించారు. కమలామూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇక్కడ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

కార్పొరేషన్, జనవరి 16: తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిధుల విషయంలో బీజేపీ నాయకులు అసత్య ప్రచారాన్ని మానుకోవాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ బహిరంగ లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్‌కు లేఖను పోస్ట్ ద్వారా పంపించారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ కృషితోనే రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరైనట్లు తెలిపారు. రాష్ట్రానికి రెండు స్మార్ట్ సిటీలు వస్తే అందులో ఒకటి కరీంనగర్‌కు కేటాయించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా బీజేపీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.

సీడీఎంఏకు వినతి

కార్పొరేషన్, జనవరి 16: కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో 12 మంది కార్మికులను అక్రమంగా నియమించారని, దీనిపై విచారణ చేపట్టాలని మంగళవారం హైదరాబాద్‌లో సీడీఎంఏకు బీఆర్ఎస్ నాయకుడు సోహన్ సింగ్ వినతి పత్రం అందజేశారు. గెస్ట్ హౌస్‌లో మున్సిపల్ కార్మికుల కింద నియామకాలు చేపట్టారని, దీనిపై మున్సిపల్ రాష్ట్ర శాఖ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని పేర్కొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

తిమ్మాపూర్, జనవరి16: పిల్లలను పనిలో పెట్టుకోవద్దని చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్ అన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇటుకబట్టీలు, ఇతర పరిశ్రమల్లో ఆపరేషన్ స్మైల్ ఇన్‌చార్జి ఎస్ఐ అన్వర్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. కార్మికులు, యజమానులతో మాట్లాడారు. 14ఏండ్లు లోపువారిని పనిలో పెట్టుకోవద్దని, 15-18ఏండ్లు పూర్తి కాని పిల్లలను ప్రమాదకరమైన పనిలో పెట్టుకోవద్దని తెలిపారు. సిబ్బంది రమేశ్, స్వప్న, సరళ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం

హుజూరాబాద్‌టౌన్, జనవరి16: పట్టణంలో సంక్రాంతి సందర్భంగా రథోత్సవం (బండ్లు తిరిగే కార్యక్రమం) కనుల పండువగా సాగింది. ముందుగా ఆర్య క్షత్రీయ వంశస్తుల రథానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ హనుమాన్ ఆలయ ఉత్సవ తాత్కాలిక కమిటీ సభ్యులతో కలిసి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి రథానికీ జ్ఞాపికను అందజేసి, నిర్వాహకులను ఘనంగా సన్మానించారు.

పీఏసీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

జమ్మికుంట, జనవరి16: పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను చైర్మన్ పొనగంటి సంపత్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్ రావు, సంఘం కార్యదర్శి రవి తదితరులు ఆవిష్కరించారు. అనంతరం వాటిని పంపిణీ చేశారు. ఇక్కడ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు, సభ్యులు, సిబ్బంది, రైతులున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత అంబేద్కర్ యూత్ జట్టు

తిమ్మాపూర్ రూరల్, జనవరి16: రేణికుంటలో సంక్రాంతి పండుగ సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించిన రేణికుంట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో గ్రామానికి చెందిన అంబేద్కర్ యూత్ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్, రన్నరప్‌గా నిలిచిన జట్లకు టోర్నమెంట్ నిర్వాహకుడు కుంభం శ్రీనివాస్ నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, ఉపసర్పంచ్ కుంభం శ్రీనివాస్, నాయకులు ల్యాగల దేవేందర్ రెడ్డి, బొంగాని రమేశ్, భావండ్ల లక్ష్మణ్, బోయిని సంపత్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి విశేష అభిషేకం

కరీంనగర్ రూరల్, జనవరి 16: దుర్శేడ్‌లోని మరకత లింగ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి అర్చకుడు ప్రశాంత్ శర్మ విశేష అభిషేకం నిర్వహించారు. ఉపసర్పంచ్ సంపత్‌రావు, తిరుపతి, రాఘునందన్‌రావు, శ్రీరామోజు తిరుపతి, ఓంకార్, తోట తిరుపతి, బుర్ర హరీశ్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మానకొండూర్‌రూరల్: పచ్చునూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి, జీవీఆర్

మానకొండూర్ రూరల్, జనవరి16: పచ్చునూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాశిపాక అశోక్, నర్మెట వీరమ్మ, లక్ష్మీపూర్‌కు చెందిన సింగిల్ విండో డైరెక్టర్ ఎర్ర మల్లయ్య తండ్రి ఓదెలు ఇటీవల మృతి చెందారు. మంగళవారం బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పరామర్శించారు. వారి వెంట జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, బీఆర్ఎస్ తిమ్మాపూర్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, ఉప సర్పంచ్ దాసరి వేణుగోపాల్ రెడ్డి, ఊటూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎడ్ల సతీశ్, గ్రామాధ్యక్షుడు రామంచ ప్రవీణ్, నాయకులు, తదితరులున్నారు.

గన్నేరువరం, జనవరి16: చీమలకుంటపల్లి బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు బామండ్ల తిరుపతి తల్లి రామవ్వ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. అనంతరం గ్రామంలో పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జడ్పీటీసీ రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంప వెంకన్న, నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్, కొమురయ్య తదితరులున్నారు.

విద్యార్థులకు అభినందన

కొత్తపల్లి, జనవరి 16: నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్ -14 సాఫ్ట్‌బాల్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు ఈశ్వర్, హర్షవర్ధన్ ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. విద్యార్థులను మంగళవారం మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు మహేందర్, జహేద, ఉపాధ్యాయులు అభినందించారు.

యువతకు..

కొత్తపల్లి, జనవరి 16 : 27వ జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొన్న కరీంనగర్ యువతను నాసిక్ సెంట్రల్ ఎమ్మెల్యే దేవయాని ఫరాండే, జాతీయ యువజన అవార్డు గ్రహీత ఏ కిరణ్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీతలు లిటన్ షీల్, గంజి రాజేందర్, జిల్లా యువజన సంఘం ప్రతినిధులు మడ్డి రవిచందర్, ఉప్పు ఆదిత్య, దాసరి సింధూ, సిరి చందన, మాలతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి 'పొనగంటి' మృతికి సంతాపం

జమ్మికుంట, జనవరి16: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి, జమ్మికుంట మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పొనగంటి శంకరయ్య(55) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందగా, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజలు నివాళులర్పించారు. సంతాపం ప్రకటించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కొత్తపల్లి, జనవరి 16: కరీంనగర్ క్రికెట్ క్లబ్, సూఫ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిటీ కప్-2024 క్రికెట్ లీగ్ సీజన్ టోర్నమెంట్స్ మంగళవారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం, ఎస్సారార్ కళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలను జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ యూనిష్ పాషా, కరీంనగర్ అర్బన్ జోన్ పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి అంతటి శంకరయ్య, క్రికెట్ కోచ్ కన్నన్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. కరీంనగర్ క్రికెట్ క్లబ్ కార్యదర్శులు ప్రసాద్, సుల్తానాబాద్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి మహేందర్, అర్చరీ సంఘం కార్యదర్శి కృష్ణ, నిర్వాహకులు సురేశ్, అమన్, మహర్షి పాల్గొన్నారు.

క్రీడల ద్వారా స్నేహభావం పెరుగుతుంది

రామడుగు (చొప్పదండి), జనవరి16: క్రీడల ద్వారా స్నేహభావం పెరుగుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని వెలిచాల గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఫైనల్‌లో గౌడ యువసేన జట్టుపై ఎంబీసీటీ జట్టు విజయం సాధించింది. మంగళవారం విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన వీర్ల వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ, యువజన దినోత్సవం, సంక్రాంతి సంబురాల్లో భాగంగా క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, రైతు బంధు జిల్లా సభ్యుడు వీర్ల సంజీవరావు, ఉపసర్పంచ్ పూదరి వెంకటేశ్, టోర్నమెంట్ కోఆర్డినేటర్ వీర్ల కుందన్‌రావు, కాడే శ్రీనివాస్, తోడేటి శ్రీను, ఆర్గనైజర్లు సాతర్ల అనిల్, బండపల్లి శ్రీకృష్ణ, వంగ రాకేశ్, కాడే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి

సైదాపూర్, జనవరి16: మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన గాజుల లక్ష్మి (70) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందిందని పోలీసులు తెలిపారు. ఎస్ఐ ఆరోగ్యం, ఆమె కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం లక్ష్మి వ్యవసాయ పనులపై తమ బావి వద్దకు వెళ్లింది. తిరిగిరాక పోయేసరికి ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. మంగళవారం వారి వ్యవసాయ బావి సమీపంలోని మరో రైతు బావి వద్ద లక్ష్మి చెప్పులు కనిపించాయి. ఆ బావిలో వెతకగా మృతదేహం లభించింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవాలు

గంగాధర, జనవరి 16: కోట్లనర్సింహులపల్లి వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట కవిత-మల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్ఎం

తెలంగాణ చౌక్, జనవరి 16: కరీంనగర్ బస్టాండ్‌ను ఆర్ఎం సుచరిత మంగళవారం పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని బస్ స్టేషన్ అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) రజినీకృష్ణ, కరీంనగర్-2 డిపో మేనేజర్ మల్లయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జీఎల్ నారాయణ, అంజిరెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు వసూలు చేయాలి

జమ్మికుంట, జనవరి16: ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రాపర్టీ ట్యాక్స్‌లను సకాలంలో వసూలు చేయాలని, పట్టణ అభివృద్ధికి పాటుపడాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్ రావు కోరారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో ప్రాపర్టీ ట్యాక్స్‌పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన చైర్మన్ మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలో ఇంటి, నీటి పన్నులను వందశాతం వసూలు చేసి జిల్లాలోనే నంబర్‌వన్‌గా నిలువాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించాలని చెప్పారు. అంతకుముందు మున్సిపల్ పరిధిలోని ఇళ్లు, నల్లా కనెక్షన్లు, గత సంవత్సరం చేసిన పన్ను వసూళ్లు, ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యం తదితర అంశాలపై చర్చించారు. తర్వాత మున్సిపల్ చైర్మన్, కమిషనర్, అధికారులు పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. శానిటేషన్, చెత్త సేకరణ పరిశీలించారు. ఇంటి నిర్మాణాలు చేస్తున్న యజమానులతో మాట్లాడారు. స్థలం పరిధిలోనే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

మానసాదేవి ఆలయంలో సీసీఎల్ఏ పూజలు

గన్నేరువరం, జనవరి 16: ఖాసీంపేట గ్రామంలోని మానసాదేవి ఆలయాన్ని సోమవారం ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆర్డీవో మహేశ్వర్ తో కలిసి సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కండువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ రజినీకుమార్, ఆలయ చైర్మన్ చంద్రారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోదాయజ్ఞ వరాహస్వామి కల్యాణం

కమాన్‌చౌరస్తా, జనవరి 16: నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో మంగళవారం గోదాయజ్ఞ వరాహస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం అన్నదానం చేశారు. సర్వవైదికసంస్థానం మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక

కొత్తపల్లి, జనవరి 16: జనగామ జిల్లా దోమరకాంచ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ కబడ్డీ పోటీలకు మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థిని కృతిక శ్రీ ఎంపికైంది. కాగా, పాఠశాలలో మంగళవారం విద్యార్థినిని పారమిత పాఠశాలల అధినేత డా. ప్రసాదరావు, డైరెక్టర్లు వినోద్ రావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్ అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొత్తపల్లి, జనవరి 16: మధ్యప్రదేశ్ రాష్ట్రం సుజలపూర్‌లో ఈనెల 17 నుంచి జరిగే ఎస్జీఎఫ్ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన జిట్టబోయిన సుధేష్ణ, మడ్డి వంశీ ఎంపికయ్యారు. విద్యార్థులను ఎస్జీఎఫ్ కార్యదర్శి పీ శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, డాక్టర్ రెడ్డవేణి మధు, జిట్టబోయిన శ్రీను తదితరులు అభినందించారు.